# సింగిల్ పేజీ కథలు

## గోవిందో...హరి!

సమయం తొమ్మిదిన్నర దాటింది. స్టాఫ్ ఒక్కరొక్కరుగా వచ్చి స్టాఫ్ రిజిస్టర్‌లో సైన్ చేసి తిన్నగా సీట్లోకి వెళ్ళి కూర్చుంటున్నారు. ఎప్పుడూ పది దాటిన తర్వాత గాని రాని స్టాఫ్..వచ్చినా రిజిష్టర్‌లో సైన్ చేసి సీట్లోకి కాకుండా నేరుగా కేంటీన్‌కి పోయి, ఆ తర్వాత గాని పనిలోకి దిగని వారు ఈ రోజిలా సిన్సియర్‌గా సీట్లలో కూలబడడం చూసి అందుకు కారణం ఏమిటో తెలిసిన మేనేజర్ భజగోవిందం 'ఈ బుద్ధి రోజూ వుంటే ఎంత బావుంటుంది' అనుకున్నాడు.


స్టాఫ్లో ప్రతి ఒక్కరి మొహం వెలిగిపోతోంది. ఆఫీసులో ఎప్పుడూ ఆముదం తాగిన మొహాలేసుకుని కూర్చునే వాళ్ళంతా ఈరోజు అమృతం తాగినంత ఆనందంగా వుండటం చూసి భజగోవిందం మొహం ముట ముటలాడించాడు.

దాదాపు పది అవుతుండగా కాళ్ళీడ్చుకుంటూ ఆఫీసులో అడుగుపెట్టాడు బ్రహ్మానందం. మొహం మీద చెరుగని చిర్నవ్వుతో ఏ రోజూ స్టాఫ్ అందరికంటే ముందుగా ఆఫీసులో అడుగుపెట్టి, పేరుకు తగినట్టుగా ఎప్పుడూ ఉత్సాహంగా కనిపించే బ్రహ్మానందం ఈరోజు అందుకు పూర్తి విరుద్ధంగా వుండటం గమనించి, "ఏమిటోయ్ ఏమయింది నీకివాళ" అడిగాడు భజగోవిందం.

'చెప్పేది కాదులే' అన్నట్టుగా ఓ దిగులు నవ్వు నవ్వి, సీట్లోకి వెళ్ళిపోయాడు బ్రహ్మానందం.

అరియర్స్ అందుకోబోతున్న రోజు కావడంతో స్టాఫ్ అందరి మొహాలు ఆనందంతో వెలిగిపోతున్నాయి. అందరూ సంబరంగా వున్నారు. సంతోషంగా ఒకచోట చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు. ఎప్పుడూ బాధపడుతూ వుండే వారు కూడా ఈ రోజెంతో ఆనందంగా వున్నారు. కాని తను? నిట్టూర్చి ఫైల్లో తలదూర్చాడు. కానీ పనిమీదికి మనసుపోలేదు. ఏదో పోగొట్టుకున్న భావన!

బ్రహ్మానందం మూడీగా వుండటం కొద్దిసేపటికి స్టాఫ్ గమనించారు. వేళకు ఆఫీసుకొచ్చి, సిన్సియర్‌గా, 'వర్క్ ఈజ్ వర్షిప్' అన్న రీతిలో తలొంచుకుని పనిచేసుకుపోయే బ్రహ్మానందం అంటే వారందరికీ ఎంతో గౌరవం. అంతే కాదు. ఎవరికి ఏ కష్టమొచ్చినా "ఏమిటోయ్ అలా వున్నావ్" అంటూ పలకరించి "మొహమాటపడకు డబ్బేమైనా అవసరమైతే తీసుకో" అంటూ అభయహస్తం చాస్తాడు. మధ్యతరగతి వాడికి డబ్బుని మించిన అవసరం వేరే ఏముంటుంది? అలా ఆఫీసులో దాదాపు ప్రతి ఒక్కరూ బ్రహ్మానందం దగ్గర అంతో ఇంతో పుచ్చుకోవటం అలవాటైంది. అందరూ నూటికి పది, ఎనిమిదికి తక్కువ తీసుకోని ఈ రోజుల్లో మూడు రూపాయల అతి తక్కువ వడ్డీకి ఇచ్చేది బ్రహ్మానందం ఒక్కడే. అలా అందరికి ఆపదలలో తమని ఆదుకునే ఆపద్బాంధవుడిగా బ్రహ్మానందం అంటే భక్తిప్రపత్తులు. అందుకే ఈరోజు తమ ఆపద్బాంధవుడికి ఏం ఆపద ముంచుకొచ్చిందో అలా దిగాలు వున్నాడు అనుకుంటూ వాళ్ళల్లో వాళ్ళు గుసగుసలాడుకున్నారు. అంతటితో ఆగక ఒక్కొక్కరుగా వచ్చి ఏమయిందని అడగసాగారు.



"ఏమయిందో చెబితే మాకు చేతనయినంతలో సలహా ఇవ్వటం గానీ, సహాయం చేయటం గానీ చేస్తామన్నారు" మూకుమ్మడిగా, ముక్తకంఠంతో.

వారి అభిమానానికి చలించినా జీవం లేని నవ్వొకటి నవ్వి ఊరుకున్నాడు. లంచ్ అవర్ వరకు ఎలాగో గడిపి, లంచ్ బాక్స్ తెచ్చుకుని కూడా స్టాఫ్ రూంకి కాకుండా కేంటీన్‌కెళ్ళాడు బ్రహ్మానందం. స్టాఫ్ అందరూ ఆనందంగా వున్న వేళ తనొక్కడే వారి మధ్య దిగులుగా ఇమడలేక.

లంచ్ అవర్లో భోజనం మధ్య 'అసలు బ్రహ్మానందం బాధేమిటంటావ్' మళ్ళీ ఎవరో బ్రహ్మానందం టాపిక్ లేవనెత్తారు. 'డబ్బుకు కొదువ లేని బ్రహ్మానందానికి బాధేముంటుందసలు' ఎవరో అందుకున్నారు. 'ఇంట్లో భార్యతో ఏమైనా గొడవ పడ్డాడేమో' అన్నారెవరో. 'అదేం కాదు. అతడి భార్య ఎంతో అణకువ కలది, అనుకూలవతి అనీ, జీవితంలో ఇంతవరకు ఆమెవల్ల బాధపడాల్సిన పరిస్థితి ఎదురు కాలేదని బ్రహ్మానందం అంటూంటాడు. కారణంవేరే ఇంకేదో' అన్నారింకెవరో. 'ఔను నాకూ అదే అనిపిస్తోంది' సమర్థించింది ఇంకో గొంతు.

'ఔనౌను. వేపుకు తినే భార్య అయితే మనలాగే ఎప్పుడూ దిగాలుగా వుండేవాడు కదా' అన్నారు మరెవరో. అందరి మాటలు వింటూ అప్పటివరకు మౌనంగా వున్న స్టెనో సుందరం "ఇవేవీ కారణాలు కాదు. బాగా ఆలోచిస్తే నాకు ఒకటే తోస్తోంది" అన్నాడు. లోలోపల ఏదో ఆలోచించుకుంటున్నవాడికి మల్లే మూసిన పెదాల మీద చూపుడు వేలితో తట్టుకుంటూ.

"ఏమిటది" కుతూహలంగా అడిగాడు అంతా ఒకే గొంతులో.

"అరియర్స్ అందబోతున్నాయి కదా అదే అతడి బాధ"

"అందుకు సంతోషించాలి కదా! బాధ దేనికి?" ముక్తకంఠంతో ప్రశ్నించారు.

స్టెనో తలూపుతూ, "సంతోషం మనకి వర్తిస్తుంది. బ్రహ్మానందానికి కాదు. ఎందుకంటే- దాదాపుగా మనం అందరం బ్రహ్మానందం దగ్గర అంతో ఇంతో పుచ్చుకున్నాం. ఇంతకాలం అసలు మాటెలా వున్నా నెల నెలా వడ్డీ ఇచ్చుకుంటూ వచ్చాము. ఈరోజు అరియర్స్ అందబోతున్నాయి. ఒకింత పెద్ద మొత్తమే మన చేతికి అందుతుంది. అందువల్ల అసలీఫాయిదాలతో కలిపి మొత్తంగా చెల్లు వేయాలని బ్రహ్మానందం అనుకుంటాడు. మీకు గుర్తుందో లేదో...నిన్న లంచ్ అవర్లో- 'అరియర్స్‌తో ఏం చేయబోతున్నారు' అని బ్రహ్మానందం అడిగాడు. అంటే 'నా బాకీ తీర్చే ఉద్దేశ్యం లేదా' అని పరోక్షంగా అడిగాడన్నమాట. అయితే మనలో మూడొంతుల మందిమి అరియర్స్ అందిన మరుక్షణం బాకీ తీర్చివేయబోతున్నట్టుగా చెప్పివేశాము. అంతవరకు సంతోషమే. మిగతా ఒక వంతు మంది మాత్రం నోరుమెదపనే లేదు. దాని గురించే బ్రహ్మానందం దిగులు" తనకున్న కొద్దిపాటి పరిజ్ఞానంతో విపులీకరించాడు స్టెనో సుందరం.

"ఔను! అదే కావచ్చు" అన్నారు బాకీ తీర్చేస్తామని

చెప్పిన మూడొంతులమంది. మిగతా ఒక వంతు మంది మాత్రం మొహాలు ఇబ్బందిగా పెట్టారు సుందరం తమని టార్గెట్ చేయడంతో.

సుందరం కొనసాగించాడు. "అప్పు ఇచ్చిన వాడెవడైనా అప్పు తీసుకున్న వాడి చేతిలో డబ్బు లేనంతకాలం వడ్డీతో సరిపుచ్చుకుంటాడు. చేతిలో పెద్ద మొత్తం పెట్టుకుని బాకీ తీర్చకపోతే 'అసలు' మొండి బాకీగా ఎక్కడ స్థిరపడిపోతుందో అని కంగారు పడతాడు. ప్రస్తుతం బ్రహ్మానందాన్ని కూడా అదే వేధిస్తోంది. కాబట్టి నే చెప్పొచ్చేదిమిటంటే..ఎప్పుడు ఎవరికి ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ ఆదుకునే బ్రహ్మానందాన్ని బాధపెట్టడం భావ్యం కాదు. కాబట్టి వాయిదా వేయకుండా అందరం బ్రహ్మానందం అప్పు అసలీఫాయిదాలతో సహా తీర్చేస్తే బ్రహ్మానందం రిలాక్స్ అయిపోతాడు. అవసరమైన వాళ్ళు కావాలనుకుంటే మళ్ళీ అడిగితే బ్రహ్మానందం లేదనడుగా" అన్నాడు.

సుందరం సలహా ఆ ఒక వంతుమంది మీద పనిచేసింది. వాళ్లు కూడా బ్రహ్మానందం బాకీ తీర్చివేయడానికే నిశ్చయించుకున్నారు.

కేంటీన్ నుండి తిరిగివస్తూ స్టాఫ్ రూమ్‌లో తన ప్రస్తావన వినిపించి గుమ్మం బయటనే నిలబడి ఈ మాటలు విన్న బ్రహ్మానందం తనలో తనే విరక్తిగా నవ్వుకుంటూ సీట్లోకొచ్చి కూలబడ్డాడు. ఇప్పుడు ఉదయం కంటే మరింత డీలాపడిపోయాడు.

నిన్న మూడొంతులమంది బాకీ తీర్చేస్తామని చెప్పగానే మూడొంతుల మూడ్ పాడయిన బ్రహ్మానందంకి ఈ రోజు మిగతా ఆ ఒక వంతు మంది కూడా తీర్చేయడానికి సిద్ధపడుతుండటంతో మొత్తం మూడ్ పాడయింది.

ఔను మరి..!

మొత్తం స్టాఫ్ తన బాకీ చెల్లించేస్తే మొత్తం లక్షా ముప్పై వేలు చేతికందుతుంది. ఆ మేరకు నెల నెలా తనకు ఏమాత్రం కష్టం లేకుండా (వసూలు విషయం), క్రమం తప్పకుండా, ఠంచనుగా ముట్టే 'వడ్డీ'కి గండి పడుతుంది. తత్ఫలితంగా వాటిల్లబోయే నష్టం చిన్నదేమీ కాదు. వేలల్లో మాట. అంత పెద్ద మొత్తంలో సైడు సంపాదన కాస్తా ఒక్కసారిగా 'హరీ'మంటుంటే బ్రహ్మానందానికేమిటి ఎవరికైనా దిగులే మరి!

**-జె.ఎం.ఫిన్‌లె** (సికింద్రాబాద్)

# కోటివిద్యలూ కూటికోసమే


అది ఒక ఫ్యాక్టరీ కాలనీ. ఒకరోజు మధ్యాహ్నం భోజనాలు చేసి వెళుతున్న భర్తలని సాగనంపుతూ, వాళ్ళ వాళ్ళ కాంపౌండ్ గేట్ల దాకా వచ్చి, నిలుచున్నారు ఆడవాళ్ళు. ఒకరినొకరు పలకరించుకుంటూ. కాసేపు బయటే నిలుచున్న, ఆ పడతుల కబుర్లను, ఒక ఆడమనిషి ఆక్రందనలు ఆటంకపరిచాయి.

"అమ్మా! అయ్యా! ఎవరైనా ఆ పున్నాత్ముడి ఆచూకీ సెప్పి పున్నెం కట్టుకోండి తల్లే! నాబిడ్డ సావుబతుకుల్లో ఉందమ్మా. ఆదొర మందిస్తే తప్ప, నా బిడ్డ దక్కదు తల్లీ.." అంటూ ఒక స్త్రీ ఏడుస్తూ, వాళ్ళ ముందు కొచ్చింది.అప్పటికే అక్కడున్న వారంతా, ఆ దీనాలాపనకి కరిగిపోయారు. ఈ మనిషికి వచ్చిన కష్టం ఏమిటి? ఈమె వెతుకుతున్న ఆ పుణ్యాత్ముడెవరు? అంటూ జాలిగా ఆమెను చూస్తూ ఉండిపోయారు.

అందరూ తన చేత ఆకర్షింపబడ్డారని గ్రహించగానే మళ్ళీ శోకాలు పెట్టిందామె. "అమ్మా ఓపాలి నాపెద్దబిడ్డకి వల్లు బాగోకుండా పోనాది. ఏ డాకటేర్లు బాగు సేయలేదు. ఎవురో దర్మాత్ములు, ఈ కోయదొర గురించి సెప్పి, పున్నెం కట్టుకున్నారు. ఆ దొరకాడికి బిడ్డనట్టుకెల్లినా. ఆ సామి - ఆ దొర - ఆ దేవుడు నా బిడ్డ సెయ్యి సూసి, దోసం సెప్పి, ఏవో మూలిక లిచ్చిండు. నాగపూజ సేయమని సెప్పిండు. అంతేనమ్మా! మీరు నమ్ముతరో నేదో తల్లీ..బిడ్డ బతికి బట్ట కట్టినాది. ఇప్పుడు నా సిన్నబిడ్డకి వల్లు బాగోనేదు. ఆసామి కాడ కెల్లినా. ఆ అయ్య సంచారానికి ఇటుకేసి వచ్చినాడని సెప్పినారు. అందుకే ఇల్లిక్కడకు లగెత్తుకొచ్చినా" ఏడుపు ఆపి కాస్త ఊపిరి పీల్చుకుందామె.

"అసలు ఆ దొర ఎవరు? ఇటెందుకు వచ్చాడు?" అని అడిగింది ఒకావిడ. నిజానికి ఆ దొర గురించి తెలుసుకోవాలనే ఆశ అక్కడున్న అందరిలోనూ కలిగింది.

ఇది గమనించేసింది ఆ స్త్రీ. "ఆ కోయదొర గురించి ఎంతని సెప్పను తల్లీ...మా దొడ్డమారాజు. సెయ్యి సూసి జరిగింది, జరుగబోయేది అంతా సెప్తడు. పరోపకారం సేసే దొడ్డమనసున్న మారాజు, ఊరూరా తిరుగుతా పెజాసేవ సేత్తడు. ఆ సామిని మీరు గనుక సూత్తే సెప్పండమ్మా" అంటూ అందరి గడ్డాలు పట్టుకుని ప్రాధేయపడింది.అంతటి శక్తిసామర్థ్యం గల ఆ దొరని చూడాలని అందరికీ ఆత్రుతగా ఉంది. ఎప్పుడూ కీళ్ళనొప్పులతో బాధపడే కనకమ్మగారూ, వయసు ముదిరిన కూతురి పెండ్లి విషయం తెలుసుకోవాలన్న ఆశతో కాంతమ్మ,



భర్తకి రావలసిన ప్రమోషను వెనక్కి పోవడానికి ఏ దోషం అడ్డు వస్తుందో, అడగాలని ఆదిలక్ష్మి కొడుక్కి ఉద్యోగం ఎప్పుడు వస్తుందో కనుక్కోవాలనే ఆశతో సావిత్రమ్మ అందరూ కోయదొర కోసం ఎదురు చూడసాగారు. ఇలా వీళ్ళందరిలోనూ ఆశలు కలిగించి, ఆ దొరని వెతుక్కుంటూ మరో వీధికి వెళ్ళిపోయింది ఆ స్త్రీ.

సాయంత్రం సమయం మూడు కావచ్చింది. "కొండ కోనల వాడిని, కొండదొరని, రామసెంద్రుని భక్తుడ్ని, కానున్న కష్టం సెప్పి, ఆదుకోమని సెప్పె కోదండరామయ్య. రానున్న గండాలు సెప్పి కావమని సెప్పె, సీతమ్మ తల్లి" అంటూ తుంబుర మీటుతూ కంచుగంటలా మ్రోగుతున్న కంఠంతో పాటలా సాగదీస్తూ వచ్చాడు కోయదొర.

అతన్ని చూడగానే "అచ్చం సినిమాలో కోయదొరలాగే ఉన్నాడు. వేషం కలర్‌ఫుల్‌గా ఉంది. ఈసారి ఫ్యాన్సీ డ్రెస్ పోటీలకు ఈ వేషం వేస్తే భలేగా ఉంటుంది" అంటూ అతని చుట్టూ తిరుగుతూ శ్రద్ధగా పరిశీలించాడు మా తమ్ముడు.

ఇంతలో బిలబిలమంటూ ఆడవారంతా వచ్చారు. ఆ కోయదొరని చూసి, ఆపద్బాంధవుడిని చూసినంతగా సంతోషపడ్డారు. అతనితో గంటన్నర సేపు కాలక్షేపం చేసారు. ఒక్కొక్కరూ ఒక్కొక్క దోషం అంటకట్టించుకుని, రకరకాల మూలికలు చూర్ణాలు అందుకుని తెచ్చిన డబ్బును వస్త్రాలను అర్పించుకున్నారు.

అదంతా గమనిస్తున్న నాకు ఎంచేతో ఆకోయదొరనీ, ఇతన్ని వెతుక్కుంటూ, అంతకుముందు వచ్చిన ఆ స్త్రీని, నమ్మబుద్ధి కాలేదు. మా తమ్ముడిని ఆ కోయదొరని అనుసరిస్తూ వెళ్ళమని చెప్పాను.

రెండు గంటల తరువాత, మా తమ్ముడు వచ్చి కడుపుబ్బేలా నవ్వాడు. వారిద్దరి విషయంలో, నేనూహించింది నిజమే అయ్యింది. మా కాలనీకి అవతల ఉన్న గ్రామదేవత గుడి అరుగు మీద కూర్చుని, ఆరోజు సంపాదన లెక్క పెట్టుకుంటున్నారట వాళ్ళిద్దరూ.

నిజానికి వాళ్ళు మోసగాళ్ళు కాదు. కోటి విద్యలూ కూటి కోసమే అని అంటారు కదా. ఆ కోయవాళ్ళ పబ్బం గడవాలంటే, వాళ్ళ దగ్గరున్న మూలికలూ-వేరులూ అమ్ముడవ్వాలి. అవి అమ్ముడవ్వాలంటే, ఆ మూలికల ప్రాముఖ్యత ప్రజలకు తెలియాలి. అంచేత ఆ స్త్రీ ముందుగా వచ్చి కోయదొర గొప్పదనాన్ని చెప్పి, ఆడవారందరిలోనూ, ఆ కోయదొరని చూడాలనే ఆశని కలిగించింది.

పెద్ద పెద్ద వ్యాపారస్థులు వ్యాపార ప్రకటనల ద్వారా తమ ప్రొడక్ట్స్ గొప్పదనాలను, చిలువలు-వలువలుగా వర్ణించి చెపుతూ ప్రజలని ఆకర్షించడం లేదూ..ఇదీ అలాంటిదే అనిపించింది. చదువుకోకపోయినా జనాన్ని ఆకర్షించేందుకు వారి పద్ధతి వారిది.

**-ఇ.రాజ్యలక్ష్మి** (సికింద్రాబాద్)